క్లుప్తంగా

ఎమ్మెల్యే మద్దిశెట్టిని కలిసిన ఈఈ పూర్ణచంద్రరావు



ఎమ్మెల్యే మద్దిశెట్టితో ఈఈ పూర్ణచంద్రరావు

దర్శి: నూతనంగా ఎన్ఎస్‌పీ డివిజన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పూర్ణచంద్రరావు బుధవారం దర్శి శాసనసభ్యుడు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మద్దిశెట్టి వేణుగోపాల్ నివాసంలో ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ షేక్ సైదా ఉన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

దొనకొండ: కిమ్స్ ఒంగోలు సౌజన్యంతో ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో దొనకొండలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సుద్దకురవ తండా సర్పంచ్ వెంకటేశ్వర నాయక్ అన్నారు. ఆయన బుధవారం సుద్దకురవ తండాలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు అంశాలను పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందుతున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు అందజేయాలన్నారు.

నేడు సెమీ క్రిస్మస్ వేడుకలు

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జీవోస్ కాలనీలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతాయని మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెపోగు సుందర్‌రాజు తెలిపారు. వేడుకల్లో మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా, హార్వెస్ట్ ఇండియా అధినేత డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్, ఉయ్యూరు హోప్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ ఎం.జాన్‌డేవిడ్ పాల్గొంటారని ఆయన తెలిపారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

ఈవీఎంల పనితీరు పరిశీలన



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న నాయకులు

దర్శి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరును అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో వాటి పనితీరుపై అవగాహన, సందేహాల నివృత్తి చేశారు. నియోజకవర్గంలోని 282 పోలింగ్ స్టేషన్లలో డ్రాఫ్ట్ ఎలక్ట్రోరల్ రోల్ ప్రచురించినట్లు ఎంపీఎస్ లోకేశ్వరరావు తెలిపారు.

యర్రగొండపాలెం: ఈవీఎంలతో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చని, దీని ద్వారా ఎటువంటి లోటుపాట్లు, అవకతవకలు జరగవని తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ నాయకులకు ఆయన ఈవీఎంలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశుభ్రతే లక్ష్యం

యర్రగొండపాలెం: పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకుంటే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఎటువంటి అంటు రోగాలు సంక్రమించవని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూనాయక్ అన్నారు. బుధవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో పాఠశాలలకు బాత్‌రూం క్లీనర్స్, టాయిలెట్ క్లీనర్స్, ఎయిర్ ఫ్రెషనర్లు పంపిణీ చేసే కార్యక్రమంలో వారు మాట్లాడారు. రోజూ పాఠశాలల ప్రారంభంలోనే తరగతి గదులు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఆయాలపై ఉందని, పాఠశాలలకు కేటాయించిన మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, సీఆర్‌ఎంటీ టి.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

జగనన్న మంచిని వివరిద్దాం

పుల్లలచెరువు: సంక్షేమ పథకాల ద్వారా సీఎం జగనన్న అన్ని వర్గాలకు చేసిన మంచి పనిని గడప గడపకు వెళ్లి వివరిద్దాం అని ఎంపీపీ కందుల వెంకటయ్య అన్నారు. బుధవారం మండలంలోని మానేపల్లిలో ఈవోఆర్డీ శరత్‌బాబు ఆధ్వర్యంలో సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారి పరిధిలో జరిగిన అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరించారు. మండల ఉపాధ్యక్షుడు రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, సచివాలయ మండల కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

పేదలు విద్యావంతులు కావాలి

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



దర్శి: స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ,డాక్టర్ శివప్రసాదరెడ్డి

దర్శి: ప్రతి పేద విద్యార్థి విద్యావంతుడు కావాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆకాంక్షించారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం ఆమె దర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. అందుకోసం తమ బూచేపల్లి వెంకాయమ్మసుబ్బారెడ్డి ట్రస్టు ద్వారా స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులకు మూలం పదో తరగతి అని, అందులో అందరూ మంచి ర్యాంకులో ఉత్తీర్ణులు కావాలనే ఉద్దేశంతో మెటీరియల్ అందజేస్తున్నట్లు దర్శి మాజీ శాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ స్టడీమెటీరియల్ అందజేశారు.

తాళ్లూరు (ముండ్లమూరు): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఉన్నత చదువులు చదివించడమే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్ట పడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు విద్యార్థుల కోసం అమలు చేస్తున్నారన్నారు. అదే పాఠశాలలో చైర్‌పర్సన్ వెంకాయమ్మ చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం సుబ్బారావు పాల్గొన్నారు.

కురిచేడు: పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయులు ఎం.బుల్లెమ్మ, ఉపాధ్యాయులు కలిసి బుధవారం పంపిణీ చేశారు. స్టడీమెటీరియల్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేశారు. 20 ఏళ్లుగా నియోజకవర్గంలోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయటం ఆనవాయితీగా వస్తోంది. ఉపాధ్యాయులు జున్ను రవికుమార్, వెంకటేశ్వర్లు, ఎం.సుబ్బారెడ్డి, శరత్, స్వర్ణలత, లక్ష్మి, సుజాత, అంజమ్మబాయి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



అన్నదానం ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డి

దర్శి: అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. స్థానిక కొత్తపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మహిళలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె బుధవారం దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజల్లో అన్నదానంపై మక్కువ పెరుగుతుందన్నారు. దివంగత దర్శి మాజీ శాసనసభ్యుడు బూచేపల్లి సుబ్బారెడ్డి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారని, ఆ తర్వాత అది అంతటా వ్యాపించి ప్రతి గ్రామంలో అన్నదానం జరగటం శుభపరిణామమన్నారు. అయ్యప్పస్వామి ఆలయంలో మహిళలు ముందుకొచ్చి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఆకలిగొన్న వారికి ఆకలి తీర్చటం కన్నా పుణ్యకార్యమేముంటుందని బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అయ్యప్పస్వామి మాలధారణ స్వాములు, మహిళలు పాల్గొన్నారు.

పూల సుబ్బయ్య కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలు

● ఎమ్మెల్యే కేపీ సహకారంతో రూ.40 లక్షలతో ఏర్పాటు



నూతన విద్యుత్ స్తంభం వద్ద కాలనీ వాసులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సహకారంతో రూ.40 లక్షలతో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత తెలిపారు. గత 30 ఏళ్ల నుంచి ఎస్టీ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన కలెక్టర్‌తో మాట్లాడి రూ.40 లక్షలు మంజూరు చేయించారని వివరించారు. ఆ నిధులతో 27 స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ భాస్కర్‌రెడ్డి బుధవారం పనులు ప్రారంభించారు. కౌన్సిలర్ హర్షిత పరిశీలించి ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

పంటనష్టం జరిగిన రైతులకు మేలు చేయండి

● ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: మిచాంగ్ తుఫాను కారణంగా పంటనష్టపోయిన ప్రతి రైతుకు మేలు చేయాలని అధికారులను దర్శి శాసనసభ్యుడు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఆయన నియోజకర్గంలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టం జరిగిన పంటలను పరిశీలించి నమోదు చేయాలని ఆయన సూచించారు. ఏ ఒక్క రైతు నష్టపోయి న్యాయం జరగలేదని బాధపడకూడదన్నారు. కష్టపడి పనిచేసుకునే రైతులకు న్యాయం చేయటం అందరి బాధ్యతని గుర్తు చేశారు.

గోహరపల్లె వాసి కువైట్‌లో మృతి



దాసరి అంకయ్య (ఫైల్)

కొమరోలు: పొట్టపూటి కోసం కువైన్ దేశానికి వెళ్లిన ఓ యువకుడు గుండెపోటుతో మృతిచెందాడు. మండలంలోని గోహరపల్లె గ్రామానికి చెందిన దాసరి అంకయ్య (37) ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ గడవడం కష్టంగా మారడంతో కువైట్ దేశానికి వెళ్లి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల ఇంటికి తిరిగి వచ్చి మళ్లీ కువైట్ వెళ్లిన దాసరి అంకయ్య గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం స్పందించి తన భర్త మృతదేహాన్ని ప్రభుత్వ ఖర్చులతో స్వగ్రామానికి తీసుకురావడానికి సహాయం చేయాలని మృతుడి భార్య సుబ్బులక్ష్మమ్మ వేడుకుంటోంది.

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనదారులతో మాట్లాడుతున్న ఎంవీఐ మాధవరావు

మార్కాపురం: రోడ్డు నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం ఎంవీఐ మాధవరావు హెచ్చరించారు. బుధవారం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వద్ద వివిధ వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎంవీఐ మాట్లాడుతూ.. ప్రతి వాహనానికి పర్మిట్, పొల్యూషన్, సీ బుక్, ఇన్సురెన్స్ కచ్చితంగా ఉండాలని, కారులో వెళ్లేవారు సీటు బెల్టు, టూ వీలర్‌పై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని చెప్పారు. వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. రోడ్డు క్రాస్ చేసేటపుడు ముందు వెనుక గమనించాలని సూచించారు. స్కూల్ పిల్లల వాహనాలు వెళ్లేటపుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

● ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



ఎమ్మెల్యే మద్దిశెట్టిని సన్మానిస్తున్న నాయకులు

దర్శి: ప్రజలు ఈ నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మళ్లీ మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి పట్టం కట్టాలని దర్శి శాసనసభ్యుడు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ కోరారు. మండలంలోని రామచంద్రపురంలో బుధవారం జరిగిన జగనే ఎందుకు ఏపీకి అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత పార్టీ పతాకాన్ని, అభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వాటిని అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేశారన్నారు. ఏ ప్రభుత్వమూ చేయని విధంగా అర్హతే ప్రామాణికంగా కుల,మత,పార్టీ,వర్గ రహితంగా పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఒక్కడే అని కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి పాల్గొన్నారు.

కోనేరులో కార్తీక దీపాలు

మార్కాపురం టౌన్: కార్తీక మాసం ముగింపు, పోలి స్వర్గానికి గుర్తుగా మార్కాపురం పట్టణంలోని మహిళలు స్థానిక చెన్నకేశవాలయంలోని కోనేరులో కార్తీక దీపాలు వదిలారు. శివాలయంలో అభిషేకాలు చేసి భక్తిని చాటుకున్నారు. చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కేశవ శర్మ, ధర్మకర్తలు, ఈవో చెన్నకేశవరెడ్డి, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ,గౌరమ్మల నిమజ్జనం



గంగమ్మ,గౌరమ్మ మూర్తుల ఊరేగింపు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నెలరోజుల పాటు పూజలు నిర్వహించిన గంగమ్మ, గౌరమ్మల అమ్మవార్లను మండలంలోని కె.ఎస్.పల్లె సమీపంలోని సగిలేరువాగు వద్ద భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. అంకాలమ్మ బజారులోని అంకాలమ్మ ఆలయంలోనూ గంగమ్మ, గౌరమ్మలను నిమజ్జనం చేశారు. గంగమ్మ, గౌరమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. వేణుగోపాలస్వామి కమిటీ అధ్యక్షుడు ఓ.వెంకటయ్య, సభ్యులు పిచ్చయ్య, రమేష్, నంద్యాల శ్రీనివాసులు, బాలగురవయ్య, డాక్టర్ వేణుగోపాల్, జింకా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డుపై తపాలా ఉద్యోగుల వంటావార్పు



హెడ్ పోస్టాఫీస్ ముందు వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్ సేవకులు

మార్కాపురం: తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ తపాల శాఖ గ్రామీణ డాక్ సేవక్‌లు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం మార్కాపురంలోని ప్రధాన తపాల కార్యాలయం వద్ద రోడ్డుపై వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. జీడీఎస్‌లకు సివిల్ సర్వెంట్ హోదా, సీనియార్టీ ఇంక్రిమెంట్లు, గ్రూప్ ఇన్సూరెన్స్, మెడికల్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టార్గెట్ల పేరుతో వేధింపులు ఆపాలని కోరారు. డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించే వరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. తాము సమ్మెలో ఉండటం వల్ల డివిజన్‌లోని సుమారు 300 బ్రాంచ్ పోస్టు ఆఫీసుల్లో సేవలు నిలిచిపోయాయన్నారు. ఈనెల 15న మార్కాపురంలో భారీ ర్యాలీ చేపడుతున్నట్లు సహాయ కార్యదర్శి మీరావలి తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ పరంగా ప్రజల సలహాలు సూచనలను తెలయజేసేందుకు ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక డిపో మేనేజర్ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గిద్దలూరు మండలం పొదలకుంటపల్లె గ్రామానికి చెందిన చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని ఆ పార్టీ యువజన విభజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించారు. శ్రీకాంత్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీ కోసం అహర్నిశలూ శ్రమిస్తుంటాడు. ప్రస్తుతం ఆయన పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయం ధర్మకర్త మండలిలో సభ్యుడిగా కొనసాగుతున్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన బాలినేని శ్రీనివాసరెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి



అన్నదానం చేస్తున్న యాదవ సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: యాదవులు ఐక్యంగా మెలగాలని వేణుగోపాలస్వామి కమిటీ అధ్యక్షుడు ఓ.వెంకటయ్య యాదవ్ అన్నారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామ సమీపంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం యాదవులకు ఆత్మీయ వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాదవులు కలిసి మెలసి ఒకే తాటిపై ఉంటూ అన్ని రంగాల్లో ముందుకు కొనసాగాలన్నారు. ఇటువంటి వనభోజనాలు యాదవుల్లో మరింత సఖ్యతను కలిగించేలా ఉంటాయని తెలిపారు. ముందుగా ఆలయంలోని భీమలింగేశ్వరస్వామి, పార్వతీదేవి అమ్మవారి మూలవిరాట్ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదవులతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. యాదవ సంఘ నాయకులు తిమ్మయ్య యాదవ్, మొర్రి పిచ్చయ్య యాదవ్, నంద్యాల శ్రీనివాసులు, జి.శ్రీధర్ యాదవ్, నంద్యాల పీరయ్య, గోవింద్ యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



మరియమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న ఏపీఎం

కొనకనమిట్ల: మండలంలోని నాయుడుపేట ఎస్సీ కాలనీకి చెందిన ఓ పేద కుటుంబానికి యూబీయూఎన్‌టీయూ కమిటీ తరఫున బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం కర్నాటి గోపాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీకి చెందిన కోలా నిరంజన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. నిరంజన్‌కు ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారని, కుటుంబ పోషణ నిమిత్తం మృతుడి భార్య మరియమ్మకు రూ.8 వేలు అందించామన్నారు. ఆడ పిల్లలు చదువుకు సహకరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏపీఎం భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీసీలు ఎజ్రా, రామయ్య, రాజయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, వీఓఏ నాగజ్యోతి పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

పుల్లలచెరువు: మండలంలోని గండిబావిగూడెం గిరిజనులకు సేవా భారతి ఆధ్వర్యంలో సముద్రాల వెంకట సుబ్బయ్య చారిటబుల్ ట్రస్టు బుధవారం దుప్పట్లు పంపిణీ చేసింది. నిర్వాహకులు మల్లికార్జునరావు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. భవిష్యత్‌లో భారీ ఎత్తున చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సహప్రచారప్రముఖ్ బాబు, సేవా భారతి జిల్లా ప్రముఖ్ రాంగోపాల్, గుంటూరు జిల్లా ప్రముఖ్ శేషారావు, వైపాలెం ఖండ్ సేవా ప్రముఖ్ నాగరమేష్, శ్రీనివాసరావు, శ్రీను, విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసార్ నాగిరెడ్డి, పాల్గొన్నారు.

నాణ్యంగా ఉన్న భోజనం వడ్డించాలి

రాచర్ల: విద్యార్థులకు నాణ్యత కలిగిన భోజనాన్ని వడ్డించాలని ఎంఈవో–2 గిరిధర్‌శర్మ అన్నారు. మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యత కలిగిన భోజనాన్ని ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలో కొంతమంది విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురువుతున్నారని, ఆ విద్యార్థులను వెంటనే గుర్తించి స్థానిక అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు చేయించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాలకొండమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో మార్కాపురం విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న చైతన్య

మార్కాపురం: గుంటూరులోని వీవీఐటీలో నిర్వహించిన బాలోత్సవంలో మార్కాపురం పట్టణానికి చెందిన స్నేహ నాట్య అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రతిమ తెలిపారు. నృత్య పోటీల్లో జూనియర్స్ విభాగంలో లాస్య తృతీయ, సీనియర్ కేటగిరీలో చైతన్య తృతీయ బహుమతి సాధించారని వివరించారు. తమ అకాడమీ విద్యార్థులు ఇటీవల కొలంబోలో నృత్య ప్రదర్శన చేసి బహుమతులు సాధించినట్లు తెలిపారు.

విద్యుత్ అక్రమ వాడకంపై చర్యలు

పెద్దారవీడు: విద్యుత్‌ను అక్రమంగా వినియోగించే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఈ పి.నాగేశ్వరరావు హెచ్చరించారు. మండల పరిధిలోని గ్రామాల్లో గృహాలు, షాపుల యజమానులు అక్రమంగా విద్యుత్‌ను సరఫరా చేసుకుంటున్నారంటూ విద్యుత్ స్తంభాలను విద్యుశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈఈ మాట్లాడుతూ మీటరు ఏర్పాటు చేసుకొని ఇంటి, షాపుల యజమానులు వెంటనే దరఖాస్తులు పెట్టుకుంటే మీటరుకు అనుమతి ఇస్తామని తెలిపారు. తనిఖీల్లో భాగంగా 35 బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో స్తంభాల నుంచి అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్న 62 గృహాలు, షాపుల సర్వీసుల యజమానులపై రూ.3.41 లక్షల అపరాద రుసుం వేసినట్లు అధికారులు తెలిపారు. ఆపరేషన్ డివిజనల్ డీఈఈలు ఎస్. శియ నాయక్, ఎస్.బాలఅంకయ్య, పి. శేషగిరిరావు, డీఈఈలు తోట శ్రీనివాసరావు, వి. శ్రీనివాసులు, ఏఈలు కోటేశ్వరరావు, కేవీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.